గోల్కొండ క్రాఫ్ట్ టెక్స్‌టైల్స్ మేళాకు విశేష స్పందన

● ఎన్టీఆర్ స్టేడియంలో ఈనెల 9 వరకు కొనసాగనున్న మేళా


కొనుగోలుదారులతో రద్దీగా మారిన స్టాళ్లు

కవాడిగూడ, మార్చి 5(ఆంధ్రజ్యోతి): తెలంగాణ హస్తకళాభివృద్ధి సంస్థ, నాబార్డ్ సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని తెలంగాణ కళాభారతి ఎన్టీఆర్ స్టేడియంలో ఇటీవల ప్రారంభమైన గోల్కొండ క్రాఫ్ట్ టెక్స్‌టైల్స్ మేళాకు సందర్శకుల నుంచి విశేష ఆదరణ లభిస్తోంది. దేశంలోని నలుమూలల నుంచి దాదాపు 150 మంది హస్తకళాకారులు తాము రూపొందించిన విభిన్న రకాల ఉత్పత్తులను ప్రదర్శనలో ఉంచారు. ఈ ప్రదర్శనలో డోక్రా కళారూపాలు, చేర్యాల్ పెయింటింగ్స్, బిద్రి, నిర్మల్ పెయింటింగ్స్, ఇత్తడి కళాకృతులు, వెదురు వస్తువులు, నిర్మల్ బొంతపల్లి కలప ఆటవస్తువులు హ్యాండ్ ఎంబ్రాయిడరీ టెర్రకోట, ముత్యాలు, ఇమిటేషన్ జువెల్లరీ, జ్యూట్ వస్తువులు, పోచంపల్లి, సిద్దిపేట, మహదేవ్‌పూర్, గద్వాల్, నారాయణపేట చీరలు బెంగాల్ కాటన్ చీరలు, కలంకారి పెయింటింగ్స్, జరీ ఎంబ్రాయిడరీ, కశ్మీర్ చీరలు, లక్నో చికత్ ఎంబ్రాయిడరీ బగల్‌పూర్ చీరలు చందేరి చీరలు, బనారస్ చీరలు, చిరుధాన్యాలు ఇతర హస్తకళా ఉత్పత్తులు ప్రదర్శనలో ఉంచామని నిర్వాహకులు తెలిపారు. ఈ ప్రదర్శన మార్చి 9న ఉదయం 11 గంటల నుంచి రాత్రి 9గంటల వరకు కొనసాగుతుందని వారు తెలిపారు.


ఎమ్మెల్యే మల్లారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న 'డబుల్' లబ్ధిదారులు

'డబుల్' ఇళ్ల వద్ద సదుపాయాలు కల్పించండి

● ఎమ్మెల్యే మల్లారెడ్డికి లబ్ధిదారుల వినతి

ముషీరాబాద్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ నియోజకవర్గానికి చెందిన 1,500 మంది లబ్ధిదారులకు మురారి గ్రామం శామీర్‌పేట మండలంలో ఇచ్చిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల వద్ద కనీస సదుపాయాలు కల్పించాలని కోరుతూ మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డికి లబ్ధిదారులు వినతిపత్రం అందజేశారు. బుధవారం మురారిపల్లి డబుల్ బెడ్‌రూం అసోసియేషన్ నాయకులు వీరేందర్, సూర్యనారాయణ, చంద్రశేఖర్, విశ్వనాథ్, నిఖిల్ తదితరులు మల్లారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2023 ఆగస్టు 24న తమకు డబుల్ బెడ్‌రూంలు మంజూరు చేసి పట్టాలు ఇచ్చారని తెలిపారు. కానీ, అందులో మంచినీటి సౌకర్యం లేదని, లిఫ్ట్ పనిచేయడం లేదని తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పేదల సమస్యలను గుర్తించి డబుల్ బెడ్‌రూం ఇళ్లకు కనీస సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఇళ్లు మంజూరు చేసినా తాము వెళ్లలేని పరిస్థితి ఉందని, అద్దె ఇళ్లలో కిరాయి కడుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యలపై త్వరలో సీఎం రేవంత్‌రెడ్డిని కలుస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో డబుల్‌బెడ్‌రూం లబ్ధిదారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


మట్టికుప్పలను తొలగించి మొక్కను నాటుతున్న కార్పొరేటర్ రచనశ్రీ

పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే సంపూర్ణ ఆరోగ్యం

కవాడిగూడ, మార్చి 5(ఆంధ్రజ్యోతి): పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే కాలనీ, బస్తీవాసులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని, ఆ దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కవాడిగూడ కార్పొరేటర్ జి.రచనశ్రీ సూచించారు. కవాడిగూడ డివిజన్‌లోని దోమలగూడ గగన్‌మహల్ ఏవీ కళాశాల, ద్వారకా హైస్కూల్‌ల సమీపంలో అనేక రోజులుగా ఇళ్ల నిర్మాణ వ్యర్థాలు, చెత్తను తీసుకువచ్చి బస్తీలోని రోడ్లపై ఫుట్‌పాత్‌లపై అక్రమంగా నిల్వ చేస్తున్నారని వచ్చిన ఫిర్యాదుకు స్పందించిన కార్పొరేటర్ రచనశ్రీ జీహెచ్‌ఎంసీ అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. ఆ స్థలాన్ని కార్పొరేటర్ బుధవారం పరిశీలించి పేరుకుపోయిన మట్టికుప్పలు, డెబ్రిస్‌ను తొలగించి ఆ స్థలంలో మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు వెంకటేష్, నగర నాయకులు మహేందర్‌బాబు, బీజేపీ డివిజన్ అధ్యక్షుడు సలంద్రి దిలీప్‌యాదవ్, డివిజన్ ప్రధాన కార్యదర్శి ఎ.ప్రభాకర్ గంగపుత్ర, బొల్ల రమేష్, శివరాజ్, ద్వారకా హైస్కూల్ ప్రిన్సిపాల్ సరితారావు, బస్తీ నాయకులు నాగేష్, రాజు. శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పటేల్‌వాడలో కార్పొరేటర్ పర్యటన


చెత్త తొలగింపు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్

అంబర్‌పేట, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ప్రజలు తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని అంబర్‌పేట కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ సూచించారు. పటేల్‌వాడలో బుధవారం ఆయన పర్యటించారు. రోడ్లపై పేరుకుపోయిన చెత్తను జీహెచ్‌ఎంసీ పారిశుధ్య సిబ్బందిని పిలిపించి తొలగింపజేశారు. ఈ కార్యక్రమంలో బస్తీవాసులు రూబీ స్టీవెన్సన్, విజయ్, జమీల్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీలో వ్యర్థాల తొలగింపు



ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ఆదేశాల మేరకు గోల్నాక తులసీనగర్ కాలనీలో పొంగిపొర్లుతున్న డ్రైనేజీ మ్యాన్‌హోల్ నుంచి వ్యర్థాలను తొలగింపజేస్తున్న జలమండలి ఏఈ రోహిత్, తదితరులు

– గోల్నాక, మార్చి 5 (ఆంధ్రజ్యోతి)

రోడ్డుకు సమాంతరంగా బీటీ ప్యాచ్ వర్క్



పోచమ్మబస్తీలో ఎత్తుగా ఉన్న బీటీ ప్యాచ్ వర్క్ సమస్యను బీఆర్ఎస్ బాగ్అంబర్‌పేట డివిజన్ ప్రధాన కార్యదర్శి కె.మహేష్‌కుమార్ జీహెచ్‌ఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లి సిబ్బందితో బుధవారం ఎత్తుగా ఉన్న బీటీ ప్యాచ్ వర్క్‌ను రోడ్డుకు సమాంతరం చేయిస్తున్న దృశ్యం

– నల్లకుంట, మార్చి 5 (ఆంధ్రజ్యోతి)


ఆర్టీసీ క్రాస్‌రోడ్ యూటర్న్ వద్ద బస్సును మలుపుతిప్పేందుకు రివర్స్ తీస్తుండడంతో నిలిచిపోయిన వాహనాలు

ఆర్టీసీ క్రాస్‌రోడ్ యూటర్న్ వద్ద ట్రాఫిక్ ఇక్కట్లు

● భారీ వాహనాలను మలుపు తిప్పేందుకూ తప్పని ఇబ్బందులు

చిక్కడపల్లి, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీక్రాస్‌రోడ్ యూటర్న్ వద్ద వాహనదారులకు ట్రాఫిక్ ఇబ్బందులు తప్పడం లేదు. అరోరా పీజీ కాలేజీ ఎదుట ఉన్న యూటర్న్ వద్ద భారీ వాహనాలు, ప్రైవేట్ బస్సులు, ఆర్టీసీ బస్సులు మలుపు తిరిగే విషయంలో ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. భారీ వాహనాలు పొడవుగా ఉండడం వల్ల యూటర్న్ వద్ద మలుపు తిరగడానికి రివర్స్ తీసుకుంటేనే ముందుకెళ్లే పరిస్థితి ఉంది. రివర్స్ తీసుకునే సందర్భంలో క్రాస్‌రోడ్స్ నుంచి చిక్కడపల్లి వరకు వాహనాలు నిలిచిపోయి రద్దీగా మారుతోంది. పాదచారులు కూడా ఈ యూటర్న్ వద్ద నడవలేని స్థితి నెలకొంది. మెయిన్‌రోడ్డుకు ఎడమ పక్కన రోడ్డు వేయకపోవడం వల్ల వాహనాలు తారు వేసిన రోడ్డుపై నుంచి మాత్రమే వెళ్తున్నాయి. దీంతో టర్నింగ్ సమయంలో సమస్య ఎదురవుతోంది. ఈ మలుపు వద్ద రోడ్డును రెండు వైపులా వెడల్పు చేయాల్సిన అవసరం ఉంది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు.

ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటాం



ఆర్టీసీక్రాస్‌రోడ్‌కు కూతవేటుదూరంలో ఉన్న యూటర్న్ వద్ద ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటాం. ఉదయం, సాయంత్రం రద్దీ సమయాల్లో హోమ్‌గార్డులను నియమిస్తాం. వాహనాలు స్పీడ్‌గా వెళ్తుండడంతో ఇక్కడ సమస్య వస్తోంది. యూటర్న్ వద్ద వేగనియంత్రణ చర్యలు తీసుకుంటాం.

– వీరేశం, చిక్కడపల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్

రోడ్డు వెడల్పు విషయం అధికారుల దృష్టికి తీసుకెళ్తా



ఆర్టీసీక్రాస్‌రోడ్ సమీపంలోని యూటర్న్ వద్ద ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ఆ ప్రాంతంలో రోడ్డును వెడల్పు చేసే విషయాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తా. రోడ్డుకు ఒకవైపు కాలేజీ, మల్టీప్లెక్స్ నిర్మాణం, మరోవైపు షాపింగ్ మాల్ ఉండడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది.

– పావనివినయ్‌కుమార్, గాంధీనగర్ కార్పొరేటర్

తొలి రోజు ఇంటర్ పరీక్షలు ప్రశాంతం



కాచిగూడ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో, ముషీరాబాద్ సెయింట్ పాయిస్ కాలేజీ ఆవరణలో హాల్ టికెట్ నెంబర్లు చూస్తుకుంటున్న విద్యార్థులు

● పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్

బర్కత్‌పుర, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ఇంటర్ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. కాచిగూడ ప్రభుత్వ జూనియర్ కళాశాల, కేడియా కళాశాల, తపస్య కళాశాల, సెయింట్ ఫ్రాన్సిస్ జూనియర్ కళాశాల, శ్రీశ్యామలాదేవి బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్ష సెంటర్లను ఏర్పాటు చేశారు. విద్యార్థులు ఉదయం 8గంటల నుంచి ఆయా పరీక్షా సెంటర్లకు చేరుకున్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ముషీరాబాద్‌లో..

ముషీరాబాద్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్‌లోని రాంనగర్ సెయింట్ పాయిస్ జూనియర్ కాలేజీలో 611 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 596 మంది హాజరయ్యారు. పరీక్షా కేంద్రాల వద్ద పెద్ద ఎత్తున జనం గుమికూడడంతో పరిసర ప్రాంతం రోడ్లు కిక్కిరిసి పోయాయి. పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందు జాగ్రత్తగా పోలీసులు 144 సెక్షన్ విధించారు.

లంబాడీల అభివృద్ధికి సహకరిస్తాం

సేవాలాల్ జయంతి వేడుకలో పలువురు ప్రజాప్రతినిధులు


అభివాదం చేస్తున్న ఎంపీలు కె.లక్ష్మణ్, అనిల్‌కుమార్‌యాదవ్, ఎమ్మెల్యే ముఠా గోపాల్, భోజ మహారాజ్ సేవాలాల్, తదితరులు

రాంనగర్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): లంబాడీల అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తామని ఎంపీలు డాక్టర్ కె.లక్ష్మణ్, ఎం.అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే ముఠా గోపాల్, భోజు మహారాజ్ సేవాలాల్ హామీ ఇచ్చారు. బంజారాల ఆరాధ్యదైవం సేవాలాల్ మహారాజ్ చూపిన మార్గం ఆచరణీయమని అన్నారు. బుధవారం బాగ్‌లింగంపల్లిలోని లంబాడీ తండాలో సంతు సద్గురు సేవాలాల్ మహారాజ్ 286వ జయంతి ఉత్సవాలు, మహాభోగ్ భండారు కార్యక్రమం నిర్వహించారు. సేవాలాల్ సేన నగర అధ్యక్షుడు కల్యాణ్‌నాయక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఎంపీలు డాక్టర్ కె.లక్ష్మణ్, ఎం.అనిల్‌కుమార్‌యాదవ్, ఎమ్మెల్యే ముఠా గోపాల్, భోజు మహారాజ్ సేవాలాల్ తదితరులు ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. బంజారాల అభివృద్ధి, సంక్షేమం కోసం సేవాలాల్ మహారాజ్ ఎంతో కృషి చేశారని అన్నారు. బంజారాలు విద్య, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ రంగాలలో రాణిస్తూ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో సేవాలాల్ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు భూక్య సంజీవ్‌నాయక్, ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ రాందాస్ తేజావత్, రాంనగర్ కార్పొరేటర్ కె.రవిచారి, బీజేపీ మహంకాళి సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు జి.భరత్‌గౌడ్, చిక్కడపల్లి సీఐ రాజునాయక్, బీఆర్ఎస్ నాయకులు శంకర్ ముదిరాజ్, ముచ్చకుర్తి ప్రభాకర్, వివేక్, బీజేపీ నాయకులు పూస రాజు, జైపాల్‌రెడ్డి, గడ్డం నవీన్, భోజుమహారాజ్ సేన సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

'తెలంగాణలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమే'

ముషీరాబాద్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఏ ఎన్నికలు జరిగినా బీజేపీ ఘన విజయం సాధిస్తున్నదని, రాష్ట్రంలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమే అని ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. బుధవారం ముషీరాబాద్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడిగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన కంచి కుమార్ ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్ కె. లక్ష్మణ్ మాట్లాడుతూ... రాష్ట్రంలో బీజేపీ బలమైన శక్తిగా మారిందని అన్నారు. ఈ సందర్భంగా బీజేవైఎం నగర కార్యదర్శి అనిల్ కుమార్ బీజేపీ మెయిన్ కమిటీలో తనకు కీలక పదవి ఇవ్వాలని ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్‌కు విజ్ఞప్తి చేశారు. లక్ష్మణ్‌ను కలిసిన వారిలో బీజేపీ ముషీరాబాద్ నియోజకవర్గ జాయింట్ కన్వీనర్ ఎం.నవీన్‌గౌడ్, బీజేవైఎం నగర కార్యదర్శి కుషాల్‌గౌడ్, బీజేవైఎం ముషీరాబాద్ నియోజకవర్గం కన్వీనర్ గడ్డం నవీన్ తదితరులు పాల్గొన్నారు.

బొడ్రాయి వార్షికోత్సవానికి లక్ష్మణ్‌కు ఆహ్వానం

రాంనగర్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): అడిక్‌మెట్ బొడ్రాయి 9వ వార్షికోత్సవ వేడుకలు ఈనెల 9న ఘనంగా నిర్వహిస్తున్నట్లు బొడ్రాయి ఉత్సవ కమిటీ సభ్యులు తిరుమల్, పాశం సాయికృష్ణయాదవ్, కిషోర్, శ్రీనివాస్ తెలిపారు. ఈ ఉత్సవాలకు హాజరు కావాలని ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్‌కు ఉత్సవ సమితి సభ్యులు ఆహ్వానపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు కిషోర్, సుబ్రహ్మణ్యం బాబు, ఉత్సవ సమితి సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్యస్వామి కల్యాణోత్సవం

రాంనగర్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): అడిక్‌మెట్ డివిజన్‌లోని విద్యానగర్ అచ్యుతరెడ్డి మార్గ్‌లో గల బ్రహ్మంగారి ఆలయ ఆవరణలో బుధవారం సుబ్రహ్మణ్యస్వామి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీఆర్ఎస్ యువజన నాయకుడు జైసింహా ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. బ్రహ్మం గారి ఆలయ అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తామన్నారు. ఈ కల్యాణోత్సవంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు కె.సురేందర్, అనురాధ, జెల్ల భిక్షపతి, మాధవి, టైలర్ శ్రీనివాస్, గోపి స్థానికులు పాల్గొన్నారు.

మహిళలకు సరైన ప్రాతినిధ్యం లభిస్తోంది

చిక్కడపల్లి, మార్చి 5(ఆంధ్రజ్యోతి): మహిళలకు సమాజంలో సరైన ప్రాతినిధ్యం లభిస్తోందని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బుధవారం చిక్కడపల్లి బ్రహ్మకుమారి సంస్థ ఆధ్వర్యంలో వివిధరంగాల ప్రముఖ మహిళలకు సన్మానం చేశారు. అరోరా పీజీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సుహాసిని, సంఘసేవకులు గీతామిశ్రా, జైభారత్ జాతీయ కార్యదర్శి కె.రజని తదితరులను ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేశారు. ఎమ్మెల్యే ముఠా గోపాల్ మాట్లాడుతూ మహిళలు అన్నిరంగాల్లో రాణిస్తున్నారని, మరింతగా రాణించాల్సిన అవసరముందన్నారు. చిక్కడపల్లి బ్రహ్మకుమారి సంస్థ ఇన్‌చార్జి జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

నగర మేయర్ స్థానాన్ని కైవసం చేసుకుంటాం : భరత్‌గౌడ్

చిక్కడపల్లి, మార్చి 5(ఆంధ్రజ్యోతి): త్వరలో జరిగే ఎన్నికల్లో నగర మేయర్ స్థానాన్ని కైవసం చేసుకుంటామని సికింద్రాబాద్ మహంకాళి జిల్లా బీజేపీ అధ్యక్షుడు గుండగోని భరత్‌గౌడ్ అన్నారు. ఇటీవల జిల్లా బీజేపీ అధ్యక్షుడిగా ఎన్నికైన భరత్‌గౌడ్, గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావని, బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంటు జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్, బీజేపీ డివిజన్ అధ్యక్షుడు వి.నవీన్‌కుమార్‌తోపాటు సీనియర్ నాయకులతో కలిసి పార్టీ కార్యకలాపాలపై బుధవారం చర్చించారు. ఈ సందర్భంగా భరత్‌గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రతి నాయకుడు, కార్యకర్త కృషి చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నేతలు రత్నసాయిచంద్, టి.గోపాల్, శ్రీకాంత్, వీఎస్టీ రాజు, పి.నర్సింగ్‌రావు, డీఎస్ రెడ్డి, పాల శ్రీను, నర్సింహ, సాయికుమార్, ఆనంద్‌రావు, వి.సాయికుమార్, హర్షవర్ధన్‌యాదవ్, మనీష్, వినీత్‌సాయి తదితరులు పాల్గొన్నారు.


బీజేపీ నేతలతో భరత్‌గౌడ్, పావనివినయ్‌కుమార్

భరత్‌గౌడ్‌ను కలిసిన పరశురాం

కవాడిగూడ, మార్చి 5(ఆంధ్రజ్యోతి): మహంకాళి జిల్లా నూతన అధ్యక్షుడు భరత్‌గౌడ్‌ను బుధవారం చిక్కడపల్లిలోని ఆయన నివాసంలో ముషీరాబాద్ నియోజకవర్గ ఎస్సీ మోర్చా కన్వీనర్ పి.పరశురాం కలిసి శాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు.

లివింగ్ రిలేషన్‌లో గర్భం దాల్చిన వైద్య విద్యార్థిని

● బాత్ రూమ్‌లో డెలివరీ.. ఆస్పత్రికి తరలింపు

● మరణించిన శిశువు.. కేసు నమోదు

రాంనగర్, మార్చి, 5(ఆంధ్రజ్యోతి): ప్రేమ పేరుతో వైద్య విద్యార్థిని వేసిన తప్పటడుగులు ఆమె ఆరోగ్య పరిస్థితి దిగజారేలా చేశాయి. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన వివరాల్లోకి వెళితే.. కర్ణాటకకు చెందిన యువతి నగరంలో ఉంటూ ఆయుర్వేద వైద్య విద్య అభ్యసిస్తూ, నగరంలోని ముషీరాబాద్‌లో ఓ హాస్టల్‌లో ఉంటోంది. పరిచయమైన యువకుడితో లివింగ్ రిలేషన్‌లో ఉన్న యువతి గర్భం దాల్చింది. ఈ సంగతి యువతి కుటుంబసభ్యులకు తెలవడంతో వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయడంతో యువకుడికి బ్రేకప్ చెప్పింది. కానీ, అప్పటికే 8వ నెల గర్భంతో ఉన్న యువతి తల్లిదండ్రులకు దూరంగా హాస్టల్‌లో ఉంటోంది. సమయం కన్నా ముందే నొప్పులు రావడంతో యువతి బాత్‌రూమ్‌కు వెళ్లి బలహీనమైన శిశువుకు జన్మనిచ్చింది. దీంతో శిశువు ఆరోగ్య పరిస్థితి క్షీణించింది. విషయం తెలుసుకున్న హాస్టల్ నిర్వాహకులు అంబులెన్స్‌లో తల్లి, శిశువును గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శిశువు చనిపోగా యువతికి వైద్యులు చికిత్స అందిస్తున్నారు. వైద్యులు మెడికోలీగల్ కేసుగా నమోదు చేసుకోవడంతో పాటు పోలీసులకు సమాచారమందించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ముషీరాబాద్ సీఐ రాంబాబు తెలిపారు.


పరీక్షలపై విద్యార్థులకు సూచనలు చేస్తున్న జిల్లా విద్యాశాఖ అధికారిని రోహిణి

ప్రణాళికాబద్ధంగా పరీక్షలకు సిద్ధం కావాలి

ముషీరాబాద్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ ప్రణాళికాబద్ధంగా విద్యార్థులు పరీక్షలకు సిద్ధం కావాలని జిల్లా విద్యాశాఖ అధికారి రోహిణి సూచించారు. ముషీరాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులను తరగతి గదిలో కలిసి పరీక్షల నేపథ్యంలో వారికి పలు సూచనలు చేశారు. వ్యాపకాలపై దృష్టిపెట్టకుండా కేవలం చదువుపైనే మనస్సును లగ్నం చేయాలని సూచించారు. ఇష్టమైన సబ్జెక్ట్‌లను బాగాచదివి, క్లిష్టమైన సబ్జెక్ట్‌లకు సైతం ప్రాధాన్యమివ్వాలని వివరించారు. ఒత్తిడికి గురికాకుండా 100 శాతం మార్కులు సాధించే విధంగా విద్యార్థులు చదువుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ విద్యామండలి డిప్యూటీ ఈవో శ్రావణ్ కుమార్, డిప్యూటీ ఐవోఎస్ జేఎల్ స్వరూపారాణి, అధ్యాపకులు నరేందర్‌యాదవ్, రత్నం, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఏపీలో ఎమ్మెల్సీ అభ్యర్థుల విజయం చంద్రబాబు ఘనత

● టీడీపీ జాతీయ ప్రచార కార్యదర్శి దశరథ్

నల్లకుంట, మార్చి 5(ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ఏపీ సీఎం నారా చంద్రబాబునాయుడు చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పట్ల ఆ రాష్ట్ర ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని టీడీపీ జాతీయ ప్రచార కార్యదర్శి జె.దశరథ్ పేర్కొన్నారు. ఈ మేరకు ఏపీలో జరిగిన ఐదు ఎమ్మెల్సీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థులు భారీ మెజారిటీతో విజయం సాధించడం నిదర్శనమన్నారు. బుధవారం హైదర్‌గూడలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఏపీ ఎమ్మెల్సీ ఎన్నికల్లో విద్యావంతులైన ఉద్యోగులు, టీచర్స్ టీడీపీ అభ్యర్థులకు ఓట్లు వేసి భారీ మెజారిటీతో గెలిపించడం హర్షణీయమని అన్నారు. రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో టీడీపీ పూర్వవైభవం సంతరించుకుంటుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

'భగత్‌సింగ్‌నగర్ వాసులకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి'

రాంనగర్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): బాగ్‌లింగంపల్లి భగత్‌సింగ్‌నగర్ గుడిసెవాసులకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సీపీఎం గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కార్యదర్శి ఎం.వెంకటేష్ డిమాండ్ చేశారు. బుధవారం సీపీఎం ముషీరాబాద్ జోన్ కార్యదర్శి ఆర్.వెంకటేష్ ఆధ్వర్యంలో భగత్‌సింగ్‌నగర్‌లో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భగత్‌సింగ్‌నగర్ ప్రజలు అనేక సంవత్సరాలుగా గుడిసెల్లో నివసిస్తూ అనేక ఇబ్బందులకు గురవుతున్నారని వాపోయారు. ఈ బస్తీలో తాగునీరు, డ్రైనేజీ లైన్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు దశరథ్, రమేష్, పాషా, మహేందర్, లెనిన్, మల్లయ్య, సంగీత, సంజీవ, శంకరయ్య, శ్రీనివాస్, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

9న అఖిల భారత పద్మశాలీ సంఘం మహాసభ

చిక్కడపల్లి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఈనెల 9న జరిగే అఖిల భారత పద్మశాలీ సంఘం మహాసభను జయప్రదం చేయాలని చేనేత వర్గాల చైతన్య వేదిక జాతీయ అధ్యక్షుడు డా. చిక్కా దేవదాసు విజ్ఞప్తి చేశారు. పద్మశాలీ సంఘం మహాసభ పోస్టర్‌ను బుధవారం చిక్కడపల్లిలోని చైతన్యవేదిక కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చిక్కా దేవదాసు మాట్లాడుతూ రాష్ట్ర జనాభాలో పద్మశాలీలు 12 శాతం ఉన్నారని తెలిపారు. రాజకీయంగా ఆర్థికంగా సామాజికంగా మన వాటా, హక్కులు, అధికారం సాధించుకోవడానికి ఈ మహాసభలు దోహదపడుతాయని అన్నారు. దేశ, రాష్ట్ర నలుమూలల నుంచి పద్మశాలీలు, చేనేత కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని మహాసభను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్ బాల్‌రాజ్, కె.సుదర్శన్‌రావు, శ్రీకాంత్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

8న మహిళా దినోత్సవం నిర్వహిస్తాం: ఆప్

కవాడిగూడ, మార్చి 5(ఆంధ్రజ్యోతి): మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని వేడుకలను నిర్వహిస్తామని ఆమ్‌ఆద్మీ పార్టీ మహిళా విభాగం నాయకులు యమునాగౌడ్, సుధారాణి, గాజుల మౌనిక తెలిపారు. బుధవారం దోమలగూడలోని ఆమ్‌ఆద్మీ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మహిళా రక్షణ, సాధికారిత, సమానత్వం కోసం మహిళలు పోరాడాలని పిలుపునిచ్చారు.

దివ్యాంగులకు జాతీయ గుర్తింపు కార్డుల జారీ పట్ల హర్షం

రాంనగర్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు జాతీయ గుర్తింపు కార్డులు జారీ చేస్తూ కేంద్రప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని దివ్యాంగుల సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు వల్లభనేని ప్రసాద్ అన్నారు. బుధవారం బాగ్‌లింగంపల్లిలోని సంఘం కార్యాలయం ఆవరణలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ కార్డులు జారీ చేయడం వల్ల దివ్యాంగులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం కన్వీనర్లు కాటమనేని వెంకటేష్‌గౌడ్, ఇమ్రాన్, ప్రేమ్‌కుమార్, అంతగిరి, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.